RNI No. : TELTEL/2019/79009

కొమురం భీమ్ విలేకరులు కావలెను
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజక వర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత
యువ జర్నలిస్టులకు అవకాశం
రిపోర్టర్‌కు ఇ.ఎస్.ఐ. భద్రత ఉంటుంది
కొమురం భీమ్ Komuram Bheem తెలుగు డైలీ
సంప్రదించగలరు : 85220 24855

తెలుగు దినపత్రిక
# కొమురం భీమ్
ప్రజా సమస్యలపై అక్షర పోరాటం

ఎడిటర్ : ముల్కల్ల ప్రసాద్

సంపుటి : 7 | సంచిక : 128 | 13 జూన్ 2026 | SIMULTANEOUSLY PUBLISHED PEDDAPALLI AND HYDERABAD | శనివారం | పేజీలు : 8 | వెల : 4

## శాంతిభద్రతల కారణంగానే
# పవన్ సభకు నిరాకరణ

- తెలంగాణలో ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి
- తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు
- కెటిఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు
- హిట్లర్ ఆదర్శమని ఎవరైనా చెబుతారా
- మీనాక్షి సీట్ చోరీకి బిజెపి కుట్ర రాజకీయాలు
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్
- ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ భేటీ



**న్యూఢిల్లీ, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):** తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చన్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా? మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగానే అయనను కలిసినట్లు తెలిసింది.




### ముడిచమురు సరఫరాలో
# అంతరాయం

- ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు
- పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం

**న్యూఢిల్లీ, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):** పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ. 95.20గా ఉండగా.. బల్క్ ధర రూ. 134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది. ➤➤ మిగతా..2లో



### గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా
# తెలంగాణ

- షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.



### యధాతథంగా సింగరేణి
# మెడికల్ బోర్డు

- పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి
- అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి

**హైదరాబాద్, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):** సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ➤➤ మిగతా..2లో



## పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్
- అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి

2



2

### మీనాక్షి వ్యవహారంపై
## సిట్ వేయగలరా?

- ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి
- రేవంత్‌కే ఫ్యూచర్ లేదు..ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ
- మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



### పద్మావతి కాలనీ భూ వివాదంలో
# దళిత యువకుని న్యాయపోరాటం

- నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ కలిగి ఉన్నా
- కాలనీలో అందరికి విక్రయించింది ఒకే పట్టాదారే
- అడ్డుపడుతుంది ఇద్దరే
- దళిత యువకునికి అన్యాయం చేసే కుట్ర
- న్యాయపోరాటం చేస్తున్న యువకుడు కిరణ్

**శ్రీనగర్‌కాలనీ, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):** అన్నీ ఉన్నా... ఏదో శని... అని పెద్దవాళ్ళు చెప్పుకునే సామెత అన్నట్లు. అన్ని రకాల పత్రాలు, న్యాయపరంగా రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ ఓ దళిత యువకునికి కష్టాలు తప్పటంలేదు. కేవలం దళితుడు అనే ఒకే ఒక్క కారణంతో తన భూమిలో నిర్మాణం చేసుకుంటానని వెళితే తన భూమి వద్దకు రాకుండా అడ్డుపడుతున్న సంఘటన రామగుండం నగరపాలక సంస్థ 48,49వ డివిజన్ల పరిధిలోని పద్మావతి కాలనీలో నెలకొంది. కాలనీలో అందరు ఎలా అయితే భూములను కొనుగోలు చేశారో అదే విధంగా నేను కొనుగోలు చేశానని... అందరికి ఒకే పట్టాదారు రిజిస్ట్రేషన్ చేశారని.. వారందరు ఎలా దర్జాగా ఇళ్ళ నిర్మాణాలు చేసుకొని ఉంటున్నారు. తనకు ఎందుకు అడ్డుపడుతున్నారని బాధితుడు వాపోతున్నాడు. కాలనీలో ఉన్న ప్రతి ఒక్కరికి ఈ కాలనీకి లే అవుట్ లేదనే విషయం తెలుసని, కేవలం ఉద్దేశపూర్వకంగానే కొందరు తను దళితుడని ఇళ్ళు నిర్మాణం చేయకూడదనే కుల వివక్షను చూపి అడ్డుకుంటూ... తన స్థలాన్ని రోడ్డుగా చిత్రీకరిస్తున్నారని బాధితుడు కిరణ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

**న్యాయంగా ముందుకు సాగుతున్న...**

ఇప్పటికే తన స్థలానికి అడ్డుపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయపరంగా పోరాటం చేస్తున్నానని, ప్రస్తుత కాలంలో కూడా దళితులను చిన్న చూపు చూస్తూ... కుల వివక్షత చూపుతున్న వారిపై ఫిర్యాదు చేశామన్నారు. నా స్థలానికి అన్ని రకాలుగా డాక్యుమెంట్స్ ఉన్నాయని, న్యాయంగా నా స్థలాన్ని నేను పొందేందుకు అన్ని శాఖల అనుమతులు ఉన్నాయన్నారు. న్యాయం జరిగే వరకు ఎంత దూరమైన ముందుకు వెల్లడానికి సిద్దంగా ఉన్నానన్నారు. దళితులపై జరుగుతున్న వివక్షను ఎదుర్కొవడానికి సిద్దమని తెలిపారు.

**కాలనీ మొత్తం సర్వే చేయించండి**

పద్మావతి కాలనీలో ఉన్న ప్రతి ఇంటికి ఒకే పట్టాదారు రిజిస్ట్రేషన్లు చేసి భూమిని కేటాయించారు. అందరు ఎలా అయితే నిర్మాణాలు చేపట్టారో... అదే విధంగా న్యాయంగా నా స్థలము నాకు ఉంటుంది. లే అవుట్ లేదనే సాకుతో నా స్థలాన్ని రోడ్డుగా చిత్రీకరించి అన్యాయం చేస్తానంటే ఉరుకునేది లేదు. న్యాయపరంగా ఎంతదూరమైన వెలతా అని.. బాధితుడు కిరణ్ పేర్కొన్నారు. అవసరమైతే కాలనీ మొత్తం రెవెన్యూ వారు సర్వే చేసి ఆక్రమణలు, సరైన పత్రాలు లేనివారి నిర్మాణాలు తొలగించాలని డిమాండ్ చేశారు.

**ఆ ఇద్దరే ఇబ్బంది పెడుతున్నారు...**

నా స్థలానికి హద్దులుగా ఉన్న ఇద్దరే ఉద్దేశపూర్వకంగా నా స్థలాన్ని ఖాజేయాలనే దురుద్దేశంతో... దళితుననే కుల వివక్షతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని.. వారి కాంపౌండ్ లోపల చెట్లు పెట్టుకోకుండా నా స్థలంలో నాటి చెట్లకు స్థలం వదిలేయాని ఆ ఇద్దరు బెదిరించడం జరుగుతుందన్నారు. ఒప్పుకోనందుకు రోడ్డుగా చిత్రీకరించి ఇలాంటి ఇబ్బందులకు గురిచేస్తున్నారని నన్ను బెదిరింపులకు గురిచేసి, కులవివక్ష చూపించందుకు వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి, న్యాయం జరిగే వరకు పోరాడుతానని పేర్కొన్నారు.

కొమురం భీమ్
Komurambheem Telugu Daily
విశ్లేషణాత్మకం

## ముడిచమురు సరఫరాలో అంతరాయం

(మొదటి పేజీ తరువాత)

పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్‌విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

## యథాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

(మొదటి పేజీ తరువాత)

ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ. 1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ. 1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

- నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత
- ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన

**న్యూఢిల్లీ, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**



రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల పక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరఫున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల పక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.






## పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్
- అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి

**న్యూఢిల్లీ, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**



పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్ ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

## సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

- నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు
- హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన

**సిద్ధిపేట, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**



సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేందుకు మీరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యూనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు వచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు కూడా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

## మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

- ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి
- రేవంత్‌కే ఫ్యూచర్ లేదు..ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ
- మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**




కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు. మీడియాతో కేటీఆర్ చిట్ చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' ఎవరో కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినందుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటి? సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్ధ పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి చేతకాని తనమే కారణమన్నారు. ఎక్కడో ఒకచోటు ఒకటి రెండు చెరువులు బాగు చేసి గొప్పలు చెప్పుకుంటున్నరు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల చెరువులను సుందరీకరించామని గుర్తు చేశారు. ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. డీలిమిటేషన్లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలను శిక్షిస్తామంటే ఎలా? దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.



### ప్రజలు ఆమోదిస్తేనే పొలిటికల్ ఎంట్రీ

**నటుడు రాఘవ లారెన్స్ పోస్ట్**

**చెన్నై, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**

ప్రముఖ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తన రాజకీయ ప్రవేశంపై మరోమారు స్పష్టత ఇచ్చారు. ప్రజలు ఆమోదిస్తేనే తాను రాజకీయాల్లోకి వస్తానని స్పష్టం చేశారు. ప్రజలు కాదంటే రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో రాఘవ లారెన్స్ ఓ వీడియో పోస్టు చేశారు. ఆ వీడియోలో తన రాజకీయ భవిష్యత్ గురించి వివరించి చెప్పారు. తుది నిర్ణయాన్ని ప్రజలకే వదిలేశారు. పొలిటికల్ ఎంట్రీపై త్వరలో ప్రకటన చేస్తానని చెప్పారు. లారెన్స్ తన పోస్టులో.. 'ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా.. మీ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించండి. ఈ వీడియో చూసిన తర్వాత, దయచేసి మీ సలహాలను, మార్గదర్శకత్వాన్ని కామెంట్స్ రూపంలో పంచుకోండి. మీరు 'వద్దు' అని చెబితే.. నేను రాజకీయాల్లోకి రాను. సమాజానికి నా నిస్వార్థ సేవను ఇలాగే కొనసాగిస్తాను. కానీ మీరు 'అవును' అని చెబితే.. మీ అందరి ఆశీస్సులతో ఈ రాజకీయ ప్రయాణాన్ని ఎప్పుడు, ఎవరితో కలిసి ప్రారంభించాలో నిర్ణయించుకుంటాను' అని పేర్కొన్నారు.

### చిన్నారి ఆర్యాంశ్‌కు సిఎం రేవంత్ అండ

**అవసరమైన ఖర్చు భరిస్తామని హామీ**

**హైదరాబాద్, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**

స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్-2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ. 1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే స్పందించారు. 'చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆర్ఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.

కొమురం భీమ్
13 జూన్ 2026 (శనివారం)

## సంపాదకీయం

# బడిలోనే ..దేశ భవిష్యత్‌కు పునాది !

విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ది చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే... స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్థోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టిల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్శించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు. ఇలా చేస్తే వారే రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్ధం చేస్తే మంచిది. ఇందుకు తల్లిడదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయ బడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.

# మామిడిపల్లు అక్కా చెల్లెళ్ల మృతి ఘటన


■ సమగ్ర దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**హైదరాబాద్, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** మామిడి పండ్లు తిని అక్కాచెల్లెళ్ల మృతి ఘటనపై నారాయణగూడ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మామిడి పండ్లు తిని భువనేశ్వరి(17), సంధ్య(10) తీవ్ర అస్వస్థకు గురై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. కర్ణాటక బీదర్ వాసులు వైజినాథ్, ఇందుమతి దంపతులు కొన్నాళ్ల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఇందుమతి బంధువు రేణుక ఈనెల జలమండలి వద్ద రెండు కేజీల మామిడి పండ్లను కొనుగోలు చేసింది. ఆ పండ్లను ఇందుమతి, ఆమె నలుగురు కుమార్తెలు తిన్నారు. ఆపై వారంతా వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థకు గురయ్యారు. చికిత్స పొందుతూ అక్కాచెల్లెళ్లు భువనేశ్వరి(17), సంధ్య(10) మృతి చెందగా.. మిగిలిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి మామిడి పండ్లు తొందరగా మగ్గేందుకు వినియోగించే రసాయనాలు కారణమా?... లేక ఇతర పదార్థాల వల్ల జరిగిందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, వైద్యుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఫుడ్, ఫ్రూట్ నమూనాలను సేకరించిన అధికారులు.. పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. గత నెలలో ఛత్తీస్‌గఢ్ జాంజ్‌గిరి-చంపా జిల్లాలో పుచ్చకాయ తిని 15 ఏళ్ల బాలుడు మరణించగా, మరో ముగ్గురు పిల్లలు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో వరుస ఘటనలతో మామిడి పండ్లు, పుచ్చకాయలు కొనాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో సమగ్ర దర్యాప్తు చేపట్టామని కమిషనర్ సజ్జన్నార్ తెలిపారు.

# హనీట్రాప్‌లో మోసపోయిన మహిళా న్యాయమూర్తి

■ పనివాళ్ల ఫిర్యాదుతో బయటపడ్డ వైనం




**చండీఘడ్, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** హనీట్రాప్ లో పడి.. ఓ మహిళా న్యాయమూర్తి రూ.లక్షలు పోగొట్టుకున్నారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా ఫిర్యాదు చేయకుండా.. తన ఇంట్లో పనిచేసే వాళ్లతో ఫిర్యాదు చేయించడం చర్చనీయాంశమైంది. హరియాణాకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తికి గతేడాది నవంబరులో టిండర్ యాప్ ద్వారా అభిమన్యు వశిష్ఠ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొద్దికాలంలోనే వీరి మధ్య బంధం బలపడింది. కొంతకాలం తర్వాత పెట్టుబడి పెడితే అధిక రాబడులు వస్తాయని మహిళా న్యాయమూర్తిని నమ్మించిన అభిమన్యు ఆమెతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడు. ఈమేరకు అతడికి సంబంధించిన ఖాతాలకు ఆమె రూ.52 లక్షలకు పైగా నగదు బదిలీ చేశారు. ఎన్నాళ్లయినా లాభాలు రాకపోవడంతో.. ఇదంతా మోసమని గ్రహించారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. తన ఇంట్లో పనిచేసే సహాయకురాలి పేరు మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. దీనిపై దర్యాప్తు చేసిన అధికారులు నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కింది కోర్టు బెయిల్ నిరాకరించడంతో.. అభిమన్యు సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు విచారణ సందర్భంగా లావాదేవీలు సహాయకురాలి బ్యాంకు నుంచి కాకుండా.. న్యాయమూర్తి ఖాతాల నుంచి జరిగాయని అదనపు సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ గుర్తించారు. అలాగే దర్యాప్తులో కూడా లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుడు, న్యాయమూర్తికి సంబంధించిన పూర్తి వాట్సప్ సంభాషణలను, కాల్ రికార్డులు సేకరించలేదని తెలిపారు. దర్యాప్తు అసంపూర్తిగా ఉన్నందున.. కీలకమైన సాక్ష్యాలు ఇంకా సేకరించాల్సి ఉందని పేర్కొంటూ నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించారు. టిండర్ యాప్, వాట్సప్‌లలో ఇరువురి మధ్య జరిగిన పూర్తి సంభాషణలను సేకరించాలని ఈ సందర్భంగా దర్యాప్తు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. నిధుల బదిలీకి వివరాలు.. నిందితుడి ఫోన్‌కి సంబంధించిన ఫోరెన్సిక్ విశ్లేషణను తొందరగా నిర్వహించాలని పేర్కొంది.

# ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత

■ క్రీడారంగానికి తీరని లోటని ప్రధాని సంతాపం



**న్యూఢిల్లీ, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** దిగ్గజ షూటర్, ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా (49) కన్నుమూశారు. కొన్ని రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన.. శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భారత్ స్టార్ షూటర్ మను బాకర్ ఈయన కోచింగ్‌లోనే రాటుదేలిన సంగతి విదితమే. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భాగంగా ఇటీవల జర్మనీ నుంచి భారత్‌కు తిరిగివస్తుండగా రాణా అనారోగ్యానికి గురయ్యారు. విమానం దిగిన వెంటనే ఆయన్ను దిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ధృవీకరించింది. 'జర్మనీలో వరల్డ్‌కప్ సందర్భంగా జస్పాల్‌కు ఛాతినొప్పి, అసౌకర్యం కలిగాయి. ఎసిడిటీగా పొరబడి.. తన పనిలో నిమగ్నమయ్యాడు. అయితే భారత్‌కు వచ్చేటప్పుడు మళ్లీ అసౌకర్యానికి గురయ్యాడు. దాంతో ఆసుపత్రిలో చేరాడు అంటూ జస్పాల్ సోదరుడు సుభాష్ వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు గెలిచిన మను బాకర్‌కు రాణా వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించారు. 2006 ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణాలు గెలిచిన జస్పాల్.. గతంలో జాతీయ జూనియర్ కోచ్‌గా వ్యవహరించారు. అప్పుడే మను బాకర్, సౌరభ్ చౌదరి లాంటి ప్రతిభావంతులైన షూటర్లు వెలుగులోకి వచ్చారు. ఒలింపిక్స్ విజయాల అనంతరం ఆయన గత ఏడాది ఫిబ్రవరిలో జాతీయ కోచ్‌గా నియమితులయ్యారు. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో హై పర్ఫార్మెన్స్ కోచ్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జస్పాల్ రాణా మృతిపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఆయన మరణం భారత క్రీడా ప్రపంచానికి తీరనిలోటన్నారు. షూటింగ్‌లో ఆయన సాధించిన విజయాలతో దేశానికి ఎంతో పేరు తీసుకువచ్చారు. యువ అథ్లెట్లను తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నిబద్ధత ఎనలేనిది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబం, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.



# హెచ్-1బీ వీసా ఫీజు పెంపు వ్యవహారం

■ బోస్టన్ కోర్టు తీర్పుపై సవాల్ చేయనున్న న్యాయశాఖ

**వాషింగ్టన్, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):** హెచ్-1బీ వీసా ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అస్సలు వెనక్కి తగ్గేది లేదని తేల్చారు. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇటీవల కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు చేపట్టింది. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే, దీన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ నేతలు ఉన్న రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈ క్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. దీంతో పలు కంపెనీలకు ఊరట లభించనట్లయ్యింది. ఈ నేపథ్యంలోనే ఫెడరల్ కోర్టు తీర్పును అప్పీల్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ నోటీసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం తాజా చర్యలతో ఈ అంశం మరికొన్ని నెలల పాటు న్యాయస్థానాల్లో మగ్గనుంది. దీంతో ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్లేని భావిస్తున్నారు.


# ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్నరైలుపై రాళ్లు

■ ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి మోహన్ భాగవత్ కాన్పూర్ నుంచి దిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఓ కిటికీ దెబ్బతింది. భాగవత్ కూడా ఇదే కోచ్‌లో ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు ధ్రువీకరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు కావాలనే రాళ్ల దాడికి పాల్పడినట్లు యూపీ పోలీసులు గుర్తించారు. ఆ ముగ్గురిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాజాగా పేర్కొన్నారు. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# భారత నావికుల మృతిపై స్పందించని ప్రధాని

■ అమెరికాకు లొంగిపోయాడంటూ రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** గతవారం అమెరికా బలగాలు ఒమన్ తీరం వద్ద ఉన్న 'సెట్టిబెల్లో' నౌకపై చేసిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందారు. ఈ ఘటనపై ప్రధాని మౌనం వహించడంపై శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, 'అంతర్జాతీయ జలాల్లో మూడు నౌకలపై అమెరికా జరిపిన దాడుల్లో మూడు రోజుల్లోనే ముగ్గురు భారతీయులు మరణించారు. అమెరికాకు లొంగిపోయిన మన ప్రధాని మాత్రం ఇప్పటివరకు ఈ ఘటనపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఏదైనా విదేశీ శక్తి ఒక భారతీయుడిని హత్య చేసినప్పుడు ప్రధాని స్పందించాలి. కానీ, ఆయన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దురదృష్టకరం. మన నావికుల్ని హత్య చేసిన కొద్దిరోజులకే.. అంటే వచ్చేవారమే జి7 సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో మోడీ చిరునవ్వు చిందిస్తూ.. ఆలింగనం చేసుకుంటూ.. ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. కానీ చనిపోయిన ఈ ముగ్గురు భారతీయుల గురించి మాత్రం ఆయన ఒక్కమాట కూడా మాట్లాడరు. తమ ప్రాణాలను బలిగొన్న వారిని ఎదిరించే ధైర్యం గానీ, శక్తి గానీ లేని ఒక లొంగిపోయిన ప్రధానమంత్రి 'భారతమాత' బిడ్డలను రక్షించలేరు' అని మోడీ తన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో మోడీని తీవ్రంగా విమర్శించారు.

# ఏడాదిగా జీవచ్ఛవంలా బతుకతున్నాను

■ ఎయిరిండియా ప్రమాదంలో బయటపడ్డ విశ్వాస్

**న్యూఢిల్లీ, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఎయిరిండియా ప్రమాద ఘటన జరిగిన నేటికి ఏడాది అయ్యింది. ఆ దుర్ఘటన నుంచి బయటపడిన ఒక్కే ఒక్కడు విశ్వాస్ కుమార్ రమేశ్ . ఏడాది గడిచిపోయినా.. ఆయన ఈ విషాదాన్ని మర్చిపోలేకపోతున్నారు. అలాగే బాధిత కుటుంబాల మనసుల్లోని ప్రశ్నలకు సమాధానాలు కావాలని అడుగుతున్నారు. నేను బతికి బయటపడినదే ప్రజలకు కనిపిస్తుంది. కానీ నాలుగు గోడల మధ్య నేను ఎదుర్కొంటున్న సవాళ్లు ఎవరికీ అర్థం కావు. ఇప్పటికీ నేను నిద్రలేమి, ఆందోళన, చేదు జ్ఞాపకాలతో పోరాడుతున్నాను. ఒక సంవత్సరం గడిచిపోయింది. బతికి ఉన్నందుకు కృతజ్ఞుడినే. కానీ అప్పటినుంచి నేను చేస్తోన్న పోరాటాన్ని మాత్రం మాటల్లో వర్ణించలేను. నా జీవితాన్ని పునర్నిర్మించుకుంటూ కుటుంబంతో కలిసి ముందుకు సాగుతున్నాను అని జాతీయమీడియాతో మాట్లాడారు. ఈ బాధ తన ఒక్కడిదే కాదని, ప్రభావిత కుటుంబాలు కూడా ఇదేరకమైన వేదనను అనుభవిస్తున్నాయని విశ్వాస్ చెప్పారు. జరిగిన దానిని ఎవరూ మార్చలేరు కానీ.. ప్రజలకు నిజాయతీ, వారు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు సమాధానాలు కావాలన్నారు. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ ఒక్కడే బయటపడ్డారు. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్.. గుజరాత్‌లోని తన కుటుంబాన్ని కలిసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ రోజు విమానంలో 11-ఏ సీటులో విశ్వాస్ కుమార్ కూర్చున్నారు. ఆ సీటు విరిగిపడిపోవడంతో ఆయనకు మంటలు అంటుకోలేదు. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కిన దృశ్యాలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో తన సోదరుడు అజయ్‌ను కోల్పోయారు. విమానం హాస్టల్ భవనంపై కూలడంతో మృతుల సంఖ్య 260కి చేరింది. కాగా.. దుర్ఘటనకు సంబంధించిన తుది రిపోర్ట్ రావడానికి ఇంకా రెండు నెలలు పట్టొచ్చని తెలుస్తోంది.

## టిఎంసి మాజీ ఎంపికి అతివాద సంస్థలతో సంబంధాలు

- అహ్మద్ హసన్‌పై దర్యాప్తునకు రెబల్ ఎంపి కకోలీ ఘోష్ డిమాండ్

**కోల్‌కతా, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ ఆ పార్టీ మాజీ ఎంపీపై సంచలన ఆరోపణలు చేశారు. తృణమూల్ మాజీ రాజ్యసభ ఎంపీ అహ్మద్ హసన్ ఇమ్రాన్‌కు బంగ్లాదేశ్‌కు చెందిన అతివాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు పశ్చిమబెంగాల్ సీఎం సువేందు అధికారికి లేఖ రాశారు. ఇమ్రాన్‌కు బంగ్లాదేశ్ సంస్థలతో సంబంధాలు ఉండొచ్చని పలు మీడియా నివేదికలు చేసిన బహిరంగ ఆరోపణలను ఘోష్ తన లేఖలో ప్రస్తావించారు. టీఎంసీ హయాంలో చికెన్ నెక్ కారిడార్ తో సహా కొన్ని సున్నితమైన ప్రాంతాలలో భారత సైన్యం, సరిహద్దు భద్రతా దళంఅభ్యర్థించిన భూమిని కేటాయించకపోవడం పైనా పలు అనుమానాలు లేవనెత్తారు. వీటిపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. రెబల్ ఎమ్మెల్యే రితబ్రత టీఎంసీలో తిరుగుబాటు లేవనెత్తిన అంశంతో తమకేమీ సంబంధం లేదని కకోలీ ఘోష్ పేర్కొన్నారు. ఆయన అసెంబ్లీలో ఉంటే తాను పార్లమెంట్‌లో ఉన్నానని అన్నారు. రెండు వర్గాలు వేర్వేరు రాజకీయ లక్ష్యాలను అనుసరిస్తున్నాయన్నారు. ఇటీవల లోక్‌సభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే. వారు స్పీకర్‌కు రాసిన లేఖ నేడు జాతీయమీడియా చేతికి వచ్చింది. దీంతో రెబల్ ఎంపీలలో కకోలీ ఘోష్, శతాబ్ది రాయ్, భారత మాజీ క్రికెటర్, ఎంపీ యూసుఫ్ పఠాన్, నటి సయోనీ ఘోష్, నటుడు శత్రుఘ్న సిన్హా మొదలైన కీలక నేతలు ఉన్నట్లు వెల్లడయ్యింది.

## సంక్షోభం నుంచి... సంక్షేమం దిశగా పయనం

### రెండేళ్ల పాలనపై చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్

**అమరావతి, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** ఏపీలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా స్పందించారు. గత ప్రభుత్వం సవాళ్లు, సంక్షోభాలు, సమస్యలను వదిలి వెళ్తే.. అన్నింటినీ అధిగమిస్తూ




సుపరిపాలనను అందిస్తున్నామన్నారు. రెండేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రాభివృద్ధిలో సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. 'ఐదు కోట్ల మంది ప్రజల అపార నమ్మకంతో ప్రజాప్రభుత్వం బాధ్యతలు చేపట్టి నేటికి సరిగ్గా రెండేళ్లు. గత ప్రభుత్వం సవాళ్లు, సంక్షోభాలు, సమస్యలను వదిలి వెళ్తే... అన్నింటినీ అధిగమిస్తూ సంక్షేమం – అభివృద్ధి – సుపరిపాలన అందిస్తున్నాం. అధికారాన్ని బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్నాం. ప్రతి పౌరుడిని, ప్రతి కుటుంబాన్ని, ప్రతి వర్గాన్ని గెలిపించడమే అజెండాగా పని చేస్తున్నాం. వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తూ... రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం. రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్రాభివృద్ధిలో అడుగడుగునా సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి ప్రజల తరఫున ధన్యవాదాలు చెబుతున్నాను. అటు కేంద్ర ప్రభుత్వ సహకారం, ఇటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ రెండేళ్ల ప్రయాణంలో అండగా ఉన్న రాష్ట్ర ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలుపుతున్నాను. రానున్న రోజుల్లో మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసేందుకు ప్రజల మద్దతు, సహకారం కోరుతూ...జై ఆంధ్రప్రదేశ్!' అంటూ సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## తాడిపత్రిలో మరోమారు ఉద్రిక్తత

- కేతిరెడ్డి ఇంటిముందు ఆందోళనకు జెసి సిద్ధం
- ఇరువర్గాల పరస్పర బాహీతో రంగంలోకి దిగిన పోలీసులు

**అనంతపురం, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** తాడిపత్రిలో టీడీపీ, వైసీపీ ఆందోళనలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపుమేరకు కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన కార్యక్రమాన్ని మొదటగా పోలీసులు అడ్డుకున్నారు. పెద్దారెడ్డిని అరెస్ట్ చేసి అనంతపురంకు తరలించారు. ఈ క్రమంలో పోలీసులకు, వైసీపీ శ్రేణులకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అక్కడ హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ సమయంలో జేసీ ప్రభాకర్ రెడ్డిని ఉద్దేశించి పెద్దారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై జేసీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వెంటనే పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయాలంటూ జేసీ ఆందోళనకు దిగారు. అనుచరులతో కలిసి కేతిరెడ్డి ఇంటి వద్దకు వెళ్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో.. ఆయన అక్కడే బైఠాయించి ఆందోళకు దిగారు.తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అనుచిత వ్యాఖ్యలపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దారెడ్డి ఇంటి ఎదుట ఆందోళనకు జేసీ సిద్ధమయ్యారు. అనుచరులతో కలిసి వెళ్తున్న మున్సిపల్ చైర్మన్‌ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అనుచరులతో కలిసి రోడ్డుపై బైఠాయించి జేసీ నిరసనకు దిగారు. ఫ్యాక్షన్ చేస్తానంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రికి రానిచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పెద్దారెడ్డికి పోలీసులు భద్రత కల్పించడంపై ఆయన మండిపడ్డారు. పెద్దారెడ్డిపై ఫిర్యాదు చేసేందుకు పట్టణ పోలీస్ స్టేషన్‌కు అనుచరులతో కలిసి జేసీ ప్రభాకర్ రెడ్డి వెళ్లారు.

# స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం

- సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి
- ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం
- తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన కేంద్రం
- పోలవరం, అమరావతి,రైల్వేజోన్ తదితర ప్రాజెక్టులకు చేయూత
- జగన్ విధ్వంసంతో రాష్ట్రం అధోగతి పాలయ్యింది
- రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు




**తిరుపతి, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్రమంత్రులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి.. శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతాం. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా.. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం అన్నారు. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, దిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు. 12 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధివైపు దూసుకెళ్లిందని సీఎం అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని గెలిపిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ప్రజలను కోరామని తెలిపారు. 2024లో 57 శాతం ఓట్ షేర్.. 94 శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని చెప్పుకొచ్చారు. 2024లో రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకున్నారని అన్నారు. తన రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలైందన్నారు. రాష్ట్రం, దేశం బాగుండాలని కోరుకునే వ్యక్తి పవన్ అని చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని సీఎం విమర్శించారు. ప్రజా వేదిక కూల్చివేతతో జగన్ అరాచక పాలన మొదలైందని అన్నారు. కేంద్ర పథకాలు, సాగునీటి ప్రాజెక్టులను పక్కన పడేశారని మండిపడ్డారు. అప్పులు, అరాచకాలు, ఆర్థిక విధ్వంసం తప్ప జగన్ చేసిందేమీలేదని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. కేసులు, జైళ్లతో చీకటి పాలన సాగించారని దుయ్యబట్టారు. అలాంటి దశలో నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఏపీలో చీకటి పాలన పోయి.. ప్రజాపాలన వచ్చిందన్నారు. 21వ శతాబ్దం ప్రధాని మోదీదే అని సీఎం స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశానికి మోదీ ఆత్మస్థైర్యం ఇచ్చారన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ పాలనలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడించారు. పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్‌జెట్ తయారుకాబోతోందన్నారు. తిరుపతిలో బుల్లెట్ ఫ్యాక్టరీ వస్తోందని, రాయలసీమ ఇప్పుడు బంగారుసీమ కాబోతోందన్నారు. వచ్చే నెలలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. జొన్నవాడలో బంగారం వెలికితీస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ, సోలార్, విండ్ పవర్‌పై దృష్టి సారించినట్లు చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేస్తున్నామని తెలిపారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమ ముఖచిత్రాన్ని కాపాడతామన్నారు. కల్యాణి డ్యామ్‌కు ఈ ఏడాది నీళ్లు తీసుకొస్తున్నామన్నారు. 3 రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. '3 రాజధానులు కాదు.. 3 ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం' ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఈసభలో పాల్గొన్నారు.

## ప్రజలు అధికారంతో పాటు..
# అతి పెద్ద బాధ్యత అప్పగించారు

- ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ
- గ్రామాల అభివృద్ధితోనే దేశం బలపడుతుంది
- సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు
- సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం
- యువత ఆశయాలు, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి
- రెండేళ్ల విజయోత్సవంలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**తిరుపతి, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు.. రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశను చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రజలు రెండేళ్ల క్రితం కేవలం అధికారాన్ని మాత్రమే కాకుండా బాధ్యతను కూడా అప్పగించారని చెప్పారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామమే దేశ అభివృద్ధికి కేంద్ర బిందువని పేర్కొన్న పవన్.. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు గ్రామ పంచాయతీల స్థాయిలోనే జరగాలని అన్నారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల, జిల్లా లేదా ఎమ్మెల్యే స్థాయికి వెళ్లకుండా స్థానికంగానే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు వెళ్తోందని, రాష్ట్రంలో ఉన్న వందలాది స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలను బలహీనపరిచి, మొత్తం వ్యవస్థను ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకరించడం సరికాదన్నారు. వ్యవస్థలు బలహీనపడితే కులాలు, ప్రాంతీయ భావాలు బలపడతాయని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమిష్టి ప్రయత్నాలు ఫలించాయని పవన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి, జాతీయ పండుగలు నిర్వహించడానికి కూడా నిధులు లేవని అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిని 'బ్రోకెన్ గవర్నెన్స్'గా అభివర్ణించారు. గ్రామాల్లో రోడ్లు ఎక్కడ వేయాలి? ఎవరికి ఇళ్లు అవసరం వంటి నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా ప్రజల మధ్య గ్రామసభల్లో తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. గ్రామసభలు బలపడితే సర్పంచ్‌లు బలపడతారని, అప్పుడు ఎమ్మెల్యేలు స్థానిక సమస్యల కంటే యువత భవిష్యత్తు, పరిశ్రమలు, అభివృద్ధి వంటి పెద్ద అంశాలపై దృష్టి సారించగలరని అన్నారు. ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీలే అతిపెద్ద విశ్వవిద్యాలయాలని పేర్కొన్న ఆయన, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానం కూడా గ్రామస్థాయి నుంచే ప్రారంభమైందని గుర్తు చేశారు. గత రెండేళ్లలో రాజకీయ స్థిరత్వం సాధించడంతో పాటు గ్రామాల వరకు ప్రజాస్వామ్యాన్ని తీసుకెళ్లామని చెప్పారు.



## చిన్నారి ఆర్యాంశ్‌కు సిఎం రేవంత్ అండ

### అవసరమైన ఖర్చు భరిస్తామని హామీ

**హైదరాబాద్, జూన్ 12** స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్–2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే స్పందించారు. 'చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆర్ఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.




# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశాం

- యాసంగి 2025-26లో 59,342 మంది రైతుల నుంచి 4.35 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు
- అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు
- ప్రభుత్వ భూముల ఆక్రమణలను సహించబోము... దశలవారీగా స్వాధీనం
- యాసంగి ధాన్యం కొనుగోళ్లు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), మట్టి రవాణా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఏటీసీ ప్రవేశాలపై మీడియా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):**
రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సమగ్ర జిల్లా కార్యాలయ సముదాయం (ఐడీఓసీ)లో శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మీడియా సమావేశం నిర్వహించి యాసంగి ధాన్యం కొనుగోళ్లు, మొక్కజొన్న కొనుగోళ్లు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), మట్టి రవాణా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల (ఏటీసీ) ప్రవేశాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 59,342 మంది రైతుల నుంచి 4.35 లక్షల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసి రూ.1,031 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే 93 శాతం చెల్లింపులు పూర్తిచేసినట్లు తెలిపారు. గత పదేళ్లలో ఇదే అత్యధిక వరి కొనుగోలు అని పేర్కొంటూ, 2024-25 యాసంగి సీజన్‌లో 4.01 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరగగా, ఈసారి 4.35 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకున్నట్లు తెలిపారు. సీఎంఆర్ బియ్యం సరఫరాలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 2024-25 ఖరీఫ్‌లో 100 శాతం, రబీలో 95 శాతం, 2025-26 ఖరీఫ్‌లో 39 శాతం, రబీలో 8 శాతం సీఎంఆర్ డెలివరీ పూర్తయినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు డిఫాల్ట్‌లో ఉన్న 10 రైస్ మిల్లులకు బకాయిలు చెల్లించి, బ్యాంకు గ్యారంటీ సమర్పించిన అనంతరం మాత్రమే ధాన్యం కేటాయించినట్లు తెలిపారు. ధాన్యం రవాణాకు రోజుకు సుమారు 600 వాహనాలను వినియోగించామని, మొత్తం 1.15 కోట్ల గన్నీ సంచులు ఉపయోగించినట్లు తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లుల్లో 6.90 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉండగా, అవసరాన్ని బట్టి ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కూడా అదనపు నిల్వ స్థలాన్ని వినియోగించినట్లు తెలిపారు. జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 18,191 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, తొమ్మిది కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 26 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసినట్లు తెలిపారు. రూ.63.40 కోట్ల విలువైన మొక్కజొన్న కొనుగోలు చేయగా, ఇప్పటికే రూ.14.84 కోట్ల చెల్లింపులు చేసినట్లు చెప్పారు. మొక్కజొన్న నిల్వ కోసం 29 వేల మెట్రిక్ టన్నుల స్థలాన్ని గుర్తించామని తెలిపారు. రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిగినప్పటికీ పలు సవాళ్లు ఎదురయ్యాయని కలెక్టర్ తెలిపారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, అదే సమయంలో యూరియా నిల్వలు రావడం, ఎఫ్‌సీఐ గోదాముల్లో కార్మికుల కొరత వంటి సమస్యలను అధిగమించి కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. రైతులకు ఎక్కడా కోతలు పడకుండా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. మంథని ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన మూడు లారీలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సంబంధిత కొనుగోలు కేంద్రాలపై విచారణ కొనసాగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. తదుపరి నుంచి ఆయా కేంద్రాల్లో మార్పులు చేపడతామని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కొత్త ప్రక్రియ కాదని, 2002లో చివరిసారిగా నిర్వహించగా ప్రస్తుతం స్వాతంత్ర్యం అనంతరం ఎనిమిదోసారి ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఓటర్లలో సుమారు 80 శాతం మందిని 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నామని, ఇంకా 1.80 లక్షల మంది ఓటర్ల వివరాల పరిశీలన మిగిలి ఉందన్నారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు సేకరిస్తారని, అవసరమైన ఆధారాలను జతచేసి సమర్పించాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి బుధవారం ఈఆర్వో స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తూ మొత్తం ప్రక్రియను పారదర్శకంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఇటుక బట్టీలకు ఎనిమిది చెరువుల నుంచి 13,250 ట్రిప్పుల మట్టి రవాణాకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా వసూలు చేసిన రుసుమును ఆయా ప్రాంతాల అభివృద్ధి పనులకు వినియోగిస్తామని చెప్పారు. రైతులు వ్యవసాయ అవసరాల కోసం ఉచితంగా మట్టిని వినియోగించుకోవచ్చని తెలిపారు. మట్టి దుర్వినియోగం జరగకుండా పటిష్టమైన వ్యవస్థను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లిలో 72 ఎకరాల ప్రభుత్వ భూమిని, నరసింగాపూర్‌లో 48 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విముక్తం చేసినట్లు తెలిపారు. ముత్తారం ప్రాంతంలో కూడా భూముల స్వాధీనం కోసం చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఎవరూ ఆక్రమించవద్దని, ఆక్రమణలను తప్పనిసరిగా తొలగిస్తామని హెచ్చరించారు. పెద్దపల్లి, రామగుండం ఏటీసీలలో ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు జూన్ 30 చివరి తేదీగా నిర్ణయించినట్లు చెప్పారు. గతంలో ఈ కోర్సుల ద్వారా అనేక మంది విద్యార్థులు మంచి ఉద్యోగ అవకాశాలు పొందారని తెలిపారు. మంథనిలో మరో ఏటీసీకి అనుమతి లభించిందని, భూమి కేటాయింపు పూర్తైై త్వరలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా

## నేరుగా ప్రజల వద్దకే మనాలి

**రామగుండం, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):**
పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని లంబాడి తండా గ్రామంలో శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సతీమణి, రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్ సందర్శించారు. ఉపాధి హామీ పథకం (100 రోజుల పనులు) కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్ కూలీలతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను ఆత్మీయంగా విన్నారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత అంశాలపై చర్చించారు. పెండింగ్ వేతనాలు, చెల్లింపుల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీల సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మీ సమస్యలు మా బాధ్యతవాటి పరిష్కారం కోసం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఎల్లప్పుడూ మీతోనే ఉంటారని మనాలి రాజ్ ఠాకూర్ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సతీమణి, రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్, రామగుండం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడ్డి తిరుపతి గౌడ్, బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ గద్దల విమల- రాజయ్య, కాంగ్రెస్ పార్టీజిల్లా నాయకులు మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, పెద్దపల్లి జిల్లా ఓబీసీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్, పెద్దపల్లి జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి పూదారి సత్తయ్య గౌడ్, సింగం కిరణ్ గౌడ్, జిల్లా యువజన కార్యదర్శి నక్క రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలి

- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అవగాహన కార్యక్రమం, క్లీనింగ్ ప్రోగ్రామ్, వ్యాసరచన పోటీలు నిర్వహణ
- ప్రతిభ కనబర్చిన విద్యార్థినీలకు బహుమతుల ప్రదానం
- జిల్లా అటవీ రేంజ్ అధికారి టి.సతీష్ కుమార్

**పెద్దపల్లి, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):**
ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం పెద్దపల్లి జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు, క్లీనింగ్ ప్రోగ్రామ్, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు జిల్లా అటవీ రేంజ్ అధికారి టి.సతీష్ కుమార్ తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు "పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యం" అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేదరేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు అడవుల వల్ల కలిగే ప్రయోజనాలు, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవుల కీలక పాత్ర, వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో అటవీ సంపద ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రకృతి పట్ల బాధ్యతగా ఉండాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని అటవీ రేంజ్ అధికారి ఏం. వినయ్ నాయక్, తిరుపతి, కొమురయ్య , నరేష్, రహమతుల్లా, అటవీ శాఖ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# వీర్లపల్లి అభివృద్ధి నా బాధ్యత

- ఆర్ఎఫ్‌సిఎల్ వల్ల ప్రజలకు ఇబ్బందులు కల్గితే ఊరుకోను
- ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- త్వరితగతిన పనులు పూర్తిచేయాలి
- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



**గోదావరిఖని, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):**
వీర్ల పల్లిని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామని రామగుండం శాసన సభ్యులు ఎం . ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా శుక్రవారం 21 వ డివిజన్ లో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) , నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ పరిశ్రమల కారణంగా దుష్ప్రభావం పడడంతో పాటు గతంలో ప్రజా ప్రతినిధుల పట్టించుకోకపోవడంతో వీర్లపల్లి గ్రామం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. సింగరేణి గనుల ఏర్పాటు , ఎన్ టి పి సి రైల్వే లైన్ నిర్మాణం , ఆర్ ఎఫ్ సి ఎల్ పునరుద్దరణ సమయంలో సరైన ప్యాకేజీ ఇవ్వకపోవడంతో వీర్ల పల్లికి అన్యాయం జరిగిందని అన్నారు. తాను ప్రయత్నం చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ సహకారం లేక వీర్ల పల్లి గ్రామానికి ఆర్ ఓ ఆర్ ప్యాకేజీ అమలుకావడం లేదని అన్నారు. అయినప్పటికీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి , జిల్లా మంత్రివర్యుల సహకారంతో వీర్ల పల్లి గ్రామస్తులకు ఇతర ప్రాంతంలో స్థలాలు , ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ 5.00 లక్షల ఆర్థిక సహాయం ఇప్పించడంతో పాటు స్థానికంగా కూడా అన్ని వసతులు కల్పిశీచనున్నామని అన్నారు. మురుగు నీళ్ళు సాఫీగా బయటకు వెళ్ళడానికి సరైన డ్రైనేజ్ వ్యవస్థ కూడా ఏర్పాటు చేయిస్తామని అన్నారు. ప్రవేటు వ్యక్తుల స్థలం లో నుండి కాలువ నిర్మించవలసి ఉన్నందున యజమానికి మరో చోట స్థలం ఇస్తామని అన్నారు. కాగా ఆర్ ఎఫ్ సి ఎల్ కంపనీ ప్రహరీ ఆనుకొని ఉన్న వీర్ల పల్లి గ్రామంతో పాటు ఎల్కలపల్లి గేట్ , లక్ష్మీ పురం , చైతన్య పురి కాలనీ తదితర ప్రాంతాలన్నీ దత్తత తీసుకొని సి ఎస్ ఆర్ కింద పూర్తిగా అభివృద్ధి చేయాలని సంబందిత కంపనీ అధికారులకు ఈ సందర్భంగా ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా ఆర్ ఎఫ్ సి ఎల్ కారణంగా ఉత్పన్నమవుతున్న పలు సమస్యలను స్థానికులు తన దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రహరీ అవతల తుప్పలు పొదలు తొలగించి విష సర్పాలు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్లాంట్ శుభ్రం చేసేటప్పుడు నీళ్ళు గోడ అవతల ఉన్న ఇళ్ల లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు . అలాగే గ్రామంలో స్వశక్తి మహిళలకు అవగాహన కల్పించి ఇందిరా మహిళా శక్తి యూనిట్లు ఏర్పాటు చేసుకొని సంఘానికి రూ 30 లక్షల నుండి రూ 3.00 కోట్ల వరకు రుణం ఇప్పించి స్వయం ఉపాధి పొందడానికి మెప్మా ద్వారా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.. కాగా ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న చిన్న చిన్న కాలువలతో పాటు పెద్ద కాలువలో పెరిగిన తుప్పలను తొలగించి నీళ్ళు సాఫీ గా ప్రవహించడానికి మార్గం సుగమం చేశారు. స్థానిక స్వశక్తి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు , నగర పాలక సంస్థతో పాటు వివిధ విభాగాల అధికారులు , మెప్మా ఆర్ పి లు , స్థానికులు పాల్గొన్నారు.



## సర్ కార్యక్రమంపై బిఎల్ఓ, అధికారులకు శిక్షణ

**గోదావరిఖని, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):**
రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం పరధి లోని ఏఇఆర్ఓ, బిఎల్ఓలు, సూపెర్వైసోర్స్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సభ్యులు తో జూన్ 25 నుండి జరుగబోయే సర్‌కు సంబందించి ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను రామగుండం ఇఆర్ఓ, అడిషనల్ కలెక్టర్ (ఎల్‌బి) సమక్షంలో శుక్రవారం రోజున ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్టీపీసీ పిటిఎస్‌లోని కాకతీయ కల్యాణ మండపంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఇఆర్ఓ, అడిషనల్ కలెక్టర్ (ఎల్‌బి) అరుణ శ్రీతో పాటు పాలకుర్తి తహసీల్దార్ జీ. సునీత, రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు, మాస్టర్ ట్రైనర్ నాయబ్ తహసీల్దార్ అనిల్ పాల్గొన్నారు.


విలేకరులు కావలెను
ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో రిపోర్టర్లు కావలెను
సెల్: 8522024855


## గంజాయి,మత్తు పదార్థాలపై ఉక్కుపాదం... విక్రయిస్తే కఠిన చర్యలు

- రూ.1,00,23,250 విలువైన 200.465 కిలోల గంజాయి ధ్వంసం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):**
గంజాయి,ఇతర మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 53 కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ నిషేధిత గంజాయి 200.465 కిలోలను ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కోర్టు అనుమతితో ధ్వంసం చేసినట్లు తెలిపారు. న్యాయాధికారుల సమక్షంలో కేసు ప్రాపర్టీ నుంచి ఎఫ్ఎస్ఎల్ పరీక్షల కోసం నమూనాలు సేకరించి,మిగిలిన గంజాయిని కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ కరీంనగర్ జిల్లా,మానకొండూర్ మండలం, ఈదులగట్టెపల్లి గ్రామంలోని వెంకటరమణ ఇన్‌సినిరేటర్స్‌లో దహనం చేసినట్లు తెలిపారు. గంజాయి విక్రయించే లేదా సేవించే వారి వివరాలను పోలీసులకు అందిస్తే సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇకపై గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై వాటిని సేవించే వారిపైనా చట్టపరమైన కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి,అడిషనల్ డీసీపీ(అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,జైపూర్ ఏసీపీ ఎ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.







## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తు గడుగు జూన్ 15వరకు పొడిగింపు

- 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్

**పెద్దపల్లి, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**
2026-27 విద్యా సంవత్సరానికి గాను పెద్దపల్లి జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్) 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు దరఖాస్తు గడువు జూన్ 15వరకు పొడిగించడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు 5వ తరగతి (రెసిడెన్షియల్) లో కేటాయించిన 73 సీట్లకు తగినన్ని దరఖాస్తులు రానందున ఇంకొ 20 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1,50,000 లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2,00,000 లోపు ఉండాలని, ఒక కుటుంబం నుండి ఒకరికి మాత్రమే ప్రవేశానికి అర్హత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారాలను జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్ లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుండి పొందవచ్చును. పూర్తి చేసిన దరఖాస్తులను తగిన ధ్రువీకరణ పత్రాలతో (కులం, ఆదాయం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు మొదలైనవి) జతపరిచి జూన్ 15వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు అదే కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కొరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో లేదా ఫోన్ నెంబర్లు 9014327045, 9989354155 నందు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## దుబాయ్‌లో క్యాబ్ డ్రైవర్, బైక్ రైడర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్**

**పెద్దపల్లి, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**
తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలోని రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ అయిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా, దుబాయ్‌లో క్యాబ్ డ్రైవర్లు మరియు బైక్ రైడర్ల విదేశీ ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23 నుండి 45 సంవత్సరాల వయస్సు గలిగి, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, సంబంధిత డ్రైవింగ్/రైడింగ్ అనుభవం, ప్రాథమిక ఇంగ్లీష్ మాట్లాడటం, చదవడం తెలిసిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ ఉద్యోగాలకు 100% కమిషన్ ఆధారిత ఆదాయం ఉంటుందని, పనితీరు ఆధారంగా క్యాబ్ డ్రైవర్లకు నెలకు సుమారు ఏఇడి 2,500 నుండి ఏఇడి 4,000 (సుమారు 64,850 నుండి 1,03,770) వరకు, బైక్ రైడర్లకు నెలకు సుమారు ఏఇడి 2,500 (సుమారు 64,850) వరకు సంపాదించే అవకాశం ఉంటుందని, దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ జూన్ 25, 2026. ఆసక్తి గల అభ్యర్థులు నోటీసులో ఉన్న ్ు= కోడ్‌ను స్కాన్ చేసి, తమ వివరాలను నమోదు చేయాలని సూచించారు. తుది ఎంపిక అనేది యజమాని అవసరాలు, పత్రాల పరిశీలన, వైద్య పరీక్ష, జ×ణ/సెక్యూరిటీ క్లియరెన్స్, కంపెనీ నిబంధనలకు లోబడి ఉంటుందని, మరింత సమాచారం కోసం అభ్యర్థులు 9440049520, 9440048590 నంబర్లలో సంప్రదించగలరని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

# సర్ ప్రక్రియ్ ..ఓ భూతం లాంటిది

- చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**
ఎస్ఐఆర్ సర్ అనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ది పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

### జూన్ 21న చర్ల మండలంలో

## ఆదివాసీ యువత సమిష్టి సమావేశం

- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్ హాజరు
- యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు: వాసం ముసలయ్య



**చర్ల, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**
చర్ల మండలంలోని ఎదురు గుట్టలలో ఈ నెల 21వ తేదీన ఆదివాసీ యువతతో భవిష్యత్ కార్యాచరణపై సమిష్టి సమావేశం నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు వాసం ముసలయ్య తెలిపారు. ఈ సమావేశానికి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చర్ల మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీలకు చెందిన ఆదివాసీ యువత పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరై తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ముఖ్యంగా 1/59, 1/70 చట్టాలు, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులు, భూసంరక్షణకు సంబంధించిన అంశాలపై సమావేశంలో విస్తృత చర్చ జరగనుందని తెలిపారు. అదేవిధంగా ఎస్టీ జాబితాలో అక్రమంగా చేర్చిన లంబాడీల అంశం, ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాల అమలులో జరుగుతున్న లోపాలు, అధికారుల నిర్లక్ష్య ధోరణిపై చేపట్టాల్సిన ఉద్యమాల గురించి యువతకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 1960లో అమలులోకి వచ్చిన షెడ్యూల్డ్ ఏరియాస్ భూముల బదిలీ నిషేధ చట్టం, ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ వలసలను నిరోధించే అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రతి ఆదివాసీ గూడెంలో ప్రతి ఇంటి నుంచి ఒక ఉద్యమకారుడు తయారవ్వాలనే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మన జాతి కోసం పోరాడిన ఉద్యమ వీరులను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చిన ఆయన, రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్‌కు ఘన స్వాగతం పలకాలని కోరారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయడానికి ఆదివాసీ యువత, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## రైతు సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు



**చర్ల, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**
రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. వర్షాకాలం ప్రారంభమై రైతులు వ్యవసాయ పనులు చేపట్టినప్పటికీ ఇప్పటి వరకు రైతు భరోసా నిధులు పూర్తిస్థాయిలో జమ కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత డిసెంబర్‌లో విడుదల చేయాల్సిన నిధులను మార్చిలో కేవలం ఒక ఎకరానికి మాత్రమే జమ చేశారని, ఇంకా మిగిలిన రైతులకు అందలేదని తెలిపారు. ఇదే సమయంలో రెండో విడత కూడా రావాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా, కౌలు రైతులకు ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం, రైతు రుణమాఫీ, పండిన ప్రతి గింజ కొనుగోలు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేవని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 2018 నుంచి 2023 వరకు రైతుబంధు పథకం కింద రైతులకు క్రమం తప్పకుండా ఆర్థిక సాయం అందించారని పేర్కొన్నారు. అదేవిధంగా సుమారు 4.5 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి, లక్షా యాభై వేల మంది గిరిజన కుటుంబాలకు లబ్ధి చేకూర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. పోడు భూములకు రైతుబంధు వర్తింపజేసి గిరిజన రైతులను ఆర్థికంగా బలోపేతం చేశారని తెలిపారు. ప్రస్తుతం రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నట్లే రైతు భరోసా కోసం కూడా ఎదురుచూస్తున్నారని, కాంగ్రెస్ పాలనలో రైతులు అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేసి అన్ని వర్గాల రైతులను ఆదుకోవాలని దొడ్డి తాతారావు ప్రభుత్వాన్ని కోరారు.



### గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట

## యువకుల నిరసన

**చంద్రుగొండ, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**
కొత్తగా వచ్చిన గ్రామపంచాయతీ సెక్రటరీని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చంద్రుగొండ గ్రామ పంచాయతీకార్యాలయం ఎదుట యువకులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ... కొత్తగా సాధరణ బదిలీల్లో వచ్చిన సెక్రటరీని కాదని, పాత జి పి సెక్రటరిని ఇక్కడ పనిచేసేలా ఆర్డర్ తెప్పించేలా పంచాయతీ సర్పంచ్, అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. పనిచేయని జిపి సెక్రటరీ వద్దని, కొత్తగా వచ్చిన జిపిసెక్రటరికి అవకాశం ఇవ్వాలన్నారు. పంచాయతీ లో నిధులు సైతం సక్రమంగా ఖర్చు చేయని వారిని ఇక్కడ ఉంచటం సరికాదన్నారు. మండల అధికారులు సైతం తమ బాధ్యతలు మర్చి పైరవీలకు సపోర్టు చేస్తున్నారన్నారు. ప్రజలకు మంచిచేసే అధికారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని, కొత్తగా సెక్రటరిని విధుల్లోకి తీసుకోవాలని, లేకుండా దశల వారీగా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో రాయి రాజా, లక్ష్మణ్, నరేంద్ర, ప్రేమేమ్ దాస్, వై. లక్ష్మణ్, కొండా వంశీ,బడుగు గణేష్, బేతి నగబాబు, తదితరులు పాల్గొన్నారు.




## ఓటర్ల జాబితా పరిరక్షణలో బీఎల్ఏల పాత్ర కీలకం : విజయ్ నాయుడు

**చర్ల, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :**
భద్రాచలంలోని హరిత హోటల్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమావేశం (ఎస్ఐఆర్)లో చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు పాల్గొన్నారు. చర్ల మండలానికి చెందిన 36 బూత్‌ల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో భాగంగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఓటర్ల జాబితాలో చోటుచేసుకునే అక్రమాలు, ఓటు చోరీకి దారితీసే అంశాలు, వాటిని గుర్తించి నివారించే విధానాలపై జిల్లా కాంగ్రెస్ నాయకులు బీఎల్ఏలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తదితర జిల్లా కాంగ్రెస్ నాయకులు హాజరై బీఎల్ఏలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విజయ్ నాయుడు మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చూడడం, అక్రమ తొలగింపులు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించడం బీఎల్ఏల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని, ఓటు హక్కు రక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌తో మూగ జీవలు మృతి

**గోదావరిఖని, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):**
రామగుండం కార్పొరేషన్ పరిధిలో 6వ డివిజన్ జనగామ గ్రామంలోని గోదావరి ఒడ్డున ఉన్న పొలాలల్లో నిన్న సాయంత్రం వచ్చిన ఈదురు గాలులకు ఎస్ఎస్ 37/63 కెవిఏ ట్రాన్స్ ఫార్మర్ ఎల్ టి లైన్ లో ఫిన్ ఇన్సులేటర్ డ్యామేజ్ అవడం తో వైర్లు తెగి పొలాలల్లో కింద పడగ మేతకు వెళ్లిన సుందిళ్ల గ్రామానికి రైతులు సుంకరి బాలకృష్ణ కు చెందిన రెండు సూడి గేదెలు వాటి విలువ రూ.1,60,000 లక్ష అరువై వేలు, అదే గ్రామానికి చెందిన సుంకరి రమేష్ ది సూడి గేదె దాని విలువ రూ. 1,50,000/- లక్ష యాభై వేలు, విలువ గల మూడు పాడి గేదెలు, తెగిన విద్యుత్ వైర్లు తాకి విద్యుత్ షాక్ కి గురైయి గేదెలు అక్కడిక్కడే మృతి చెందాయి. స్థానిక రైతుల సమాచారం మేరకు 6వ డివిజన్ కార్పొరేటర్ ఆవుల శ్యామని రమేష్ అక్కడికి చేరుకొని ఎన్‌పిడిసిఎల్ లైన్ మెన్ కి సమాచారం ఇచ్చి, వాటిని పరిశీలించండి జరిగింది అలాగే వాటిని వెటర్నరీ వైద్యులు పంచనామా చేసి వాటిని రైతులు సమక్షంలో పూడ్చి పెట్టటం జరిగింది ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆవుల శ్యామని రమేష్ మాట్లాడుతు మృతి చెందిన పాడి గేదెల అంచనా విలువతో ఆ యొక్క గేదెల యాజమానులకు నష్ట పరిహారం ఇవ్వాలని ఎన్‌పిడిసిఎల్ అధికారులను కోరటం జరిగింది.

# ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే బాధ్యత నాది

- ”అమ్మా.. రేపు మీ ఇంటికి వస్తా” అని చెప్పి మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్


**గోదావరిఖని, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్):**
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్‌లో శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి తన నివాస పరిస్థితిని వివరించిన ఓ వృద్ధ మహిళకు, “అమ్మా.. రేపు మీ ఇంటికి వస్తా” అని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, చెప్పినట్లుగానే శుక్రవారం ఆమె ఇంటికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. పూరి గుడిసెలో నివాసం ఉంటున్న ఆమె కష్టాలను



స్వయంగా చూసిన ఎమ్మెల్యే, అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు మంజూర చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ... “ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్య. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి చేస్తాను. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం నా బాధ్యత అన్నారు. పేదల సంక్షేమం, వారి జీవన ప్రమాణాల మెరుగుదల కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు, నాయకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

- రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది
- రాయలసీమను రాయల్ సీమగా మార్చాం
- మనది గూగుల్ అయితే..వారిది గొడ్డలి
- తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు



**తిరుపతి, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను రాయల్‌సీమగా మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు. అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్ర్యాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

## రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

- ఇతర రాష్ట్రాల్లోలాగే తెలంగాణలోనూ కాంగ్రెస్ ఖతం
- కాంగ్రెస్ పార్టీకి ఈసారి డిపాజిట్లు కూడా దక్కవు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జోస్యం

**కరీంనగర్, జూన్ 12 (కొమురం భీమ్ న్యూస్) :** రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. . సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు.



అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని, కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి రైతుబంధు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఏమైందని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. రెండోసారి మూడు ఎకరాలకు, మూడోసారి రెండెకరాలకే ఇచ్చారు. మొత్తం రూ.20వేల కోట్లు ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని చెబుతున్నారు. కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు ఇచ్చారు. 45 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గతంలో సిద్దిపేటలో సీఎం రేవంత్ ప్రకటించారు. 65 రోజులు పూర్తయినా ఇంకా పడలేదు. దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్న రైతు బీమా పథకం కూడా బంద్ అయింది. ఎల్ఐసీకి ప్రభుత్వం ప్రీమియం చెల్లించక పోవడంతో ఆ పథకం నిలిచిపోయింది. రైతు చనిపోతే ఆ కుటుంబానికి అందాల్సిన బీమా కూడా రావడం లేదు. ఎరువులకూ ఇబ్బందులు తప్పడం లేదు. వడ్లు, మక్కలు విక్రయానికి రైతులు పడిగాపులు కాశారు. సంచులు చెదలు పట్టినా వడ్లు కొనే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత కరెంటూ పోయింది. కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారు. రైతులు ఆ పార్టీకి ఓటేసే పరిస్థితి లేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు రూ.2,500, రూ.4వేల చొప్పున పింఛను ఇవ్వడం లేదు. ప్రభుత్వ సొమ్ము రూ.100 కోట్లతో సీఎం క్యాంప్ ఆఫీస్ నిర్మించుకున్నారు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ సోకులకు నిధులు ఉంటాయి కానీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుబంధు, రైతుబీమాకు ఉండవా? రైతులకు డబ్బు ఇచ్చేందుకు రేవంత్‌కు మనసు రావడం లేదు. ఆయనకు అధికారం మత్తెక్కింది. హిట్లర్ పాలనను అంతం చేయడానికి ప్రజలు కంకణం కట్టుకున్నారు. కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రావు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు.

## కొమురం భీమ్




## అంతర్జాతీయ క్రికెట్‌కు కేన్ విలియమ్సన్ వీడ్కోలు!



న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాటర్, మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు తక్షణమే వర్తించేలా రిటైర్మెంట్ ప్రకటించాడు. తన 16 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 378 మ్యాచ్‌లు ఆడిన కేన్.. 48 సెంచరీలతో 19,346 పరుగులు సాధించాడు. అతడి సారథ్యంలోనే న్యూజిలాండ్ 2021లో తొలి ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గదను ముద్దాడింది. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్ మధ్యలోనే ఈ 35 ఏళ్ల క్లాసిక్ ప్లేయర్ వీడ్కోలు పలకడం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది.న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. 35 ఏళ్ల కేన్ విలియమ్సన్.. న్యూజిలాండ్ తరఫున 110 టెస్టులు, 175 వన్డేలు, 93 టీ20లు ఆడాడు. తన 16 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 19 వేలకుపైగా పరుగులు సాధించాడు. ఇందులో 48 సెంచరీలు, ఆరు డబుల్ సెంచరీలు ఉన్నాయి. కివీస్ తరఫున అత్యుత్తమ క్రికెటర్‌గా పేరు పొందిన విలియమ్సన్ అన్ని ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పినట్లు న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు శుక్రవారం (జూన్ 12, 2026) అధికారిక ప్రకటన విడుదల చేసింది. 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కేన్ విలియమన్స్ గతేడాది అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా వన్డే, టెస్ట్ ఫార్మాట్‌లకు సైతం వీడ్కోలు పలికాడు. “రిటైర్మెంట్ గురించి కొంతకాలంగా ఆలోచిస్తున్నా. అయితే నా వీడ్కోలుకు ఇదే సరైన సమయం అనిపించింది. 16 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో మధురానుభూతులు ఉన్నాయి. కివీస్‌కు ఐసీసీ మేజర్ టోర్నీ లేదనే భావన మాలో బలంగా ఉండిపోయింది. కానీ 2021లో ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం ద్వారా మా ఖాతాలోనూ ఒక ఐసీసీ టైటిల్ వచ్చి చేరినట్లయింది. న్యూజిలాండ్ తరఫున అంతర్జాతీయ క్రికెట్ ఆడడం నా అదృష్టంగా భావిస్తున్నా. అన్నీ ఆలోచించే రిటైర్మెంట్‌పై నిర్ణయం తీసుకున్నా” అని కేన్ విలియమ్సన్ తన రిటైర్మెంట్ ప్రకటనలో రాసుకొచ్చాడు. కాగా కేన్ విలియమ్సన్ ఆటగాడిగా మాత్రమే కాకుండా సారథిగా కూడా తనదైన ముద్ర వేశాడు. 2016 నుంచి 2024 వరకు అంటే దాదాపు 8 ఏళ్ల పాటు న్యూజిలాండ్ జట్టుకు సారథ్యం వహించాడు. తన కెప్టెన్సీలో రెండుసార్లు ఐసీసీ వరల్డ్ కప్ ఫైనల్స్‌కు కివీస్‌ను చేర్చాడు. 2019 ప్రపంచకప్, 2021 టీ20 ప్రపంచకప్‌లో అతడు ఈ ఫీట్ సాధించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ గదను అందించాడు. ఇక కేన్ విలియమ్సన్ తన కెరీర్‌లో 110 టెస్టులాడి 9,515 పరుగులు, 175 వన్డేల్లో 7,256 పరుగులు, 93 టీ20ల్లో 2,575 పరుగులు పరుగులు చేశాడు. 40 టెస్టులు, 91 వన్డేలు, 75 టీ20ల్లో న్యూజిలాండ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా తొలి టెస్టు లార్డ్స్‌లో జరిగింది. కేన్ విలియమ్సన్ కెరీర్‌లో ఇదే చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావడం గమనార్హం.

## అత్యంత బిజీ ఫాస్ట్ బౌలర్‌గా సిరాజ్

మహమ్మద్ సిరాజ్ .. పరిచయం అక్కర్లేని పేరు. హైదరాబాద్ గల్లీ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఈ పేసర్.. ఇప్పుడు టీమిండియాకు కీలకంగా మారాడు. ఒకప్పుడు బుమ్రాకు సపోర్టింగ్ రూల్‌లో మాత్రమే కనిపించిన ఇతడు.. ఇప్పుడు తనకంటూ ప్రత్యేకత సంపాదించాడు. టీమిండియా ప్రధాన పేసర్‌గా మారిపోయాడు. వైట్-బాల్ క్రికెట్‌లో ఎక్కువగా అవకాశాలు అందుకోలేకపోతున్న ఈ పేసర్.. టెస్టుల్లో మాత్రం సత్తాచాటుతున్నాడు. అంతేకాకుండా ఫిట్‌నెస్ విషయంలో ఎవరికీ అందనంతగా.. విరామం లేకుండా మ్యాచులు ఆడుతూ.. ఆదర్శనంగా నిలిస్తున్నాడు. వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ అనే పదం తన డిక్షనరీలోనే లేదు అన్నట్లుగా దూసుకెళ్తున్నాడు. దీంతో ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత బిజీగా ఉండే ఫాస్ట్ బౌలర్‌గా మారిపోయాడు. గతంలో భారత బౌలర్లకు వరుసగా క్రికెట్ మ్యాచులు ఆడేవారు. అప్పన్లు తక్కువగా ఉండటంతో కపిల్ దేవ్ లాంటి ప్లేయర్ విరామం లేకుండా మ్యాచ్‌లు ఆడేవాడు. ఆ తర్వాత జహీర్ ఖాన్, ఇషాంత్ శర్మ కూడా ఇలాంటి క్రికెటే ఆడారు. కానీ బుమ్రా రాకతో పరిస్థితి మారిపోయింది. అతడి ప్రదర్శన దృష్ట్యా.. బీసీసీఐ అతడిపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. పనిభారం దృష్ట్యా పరిమిత సంఖ్యలోనే అతడిని మ్యాచ్‌లు ఆడిస్తూ వస్తోంది. దీంతో బుమ్రా గైర్హాజరీలో పేస్ దళాన్ని నడిపించే వ్యక్తి జట్టుకు అవసరమయ్యాడు. అలాంటి సమయంలో నేనున్నా అంటూ ముందుకొచ్చాడు సిరాజ్. అప్పటి నుంచి బిజీగా మారిపోయాడు. 2023 జనవరి నుంచి సిరాజ్ టెస్టులు, వన్డేలు, టీ20లు, ఐపీఎల్‌లో కలిపి 1,231 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఈ వ్యవధిలో ఇన్ని ఓవర్లు వేసిన ఏకైక ఫాస్ట్ బౌలర్ అతడే. ముఖ్యంగా సిరాజ్ టెస్టుల్లో కీలక పేసర్‌గా మారిపోయాడు. ఏకంగా 30 మ్యాచ్‌లలో 744 ఓవర్లు వేశాడు. అంటే దాదాపు ప్రతి టెస్టులో 25 ఓవర్లు వేశాడన్నమాట. మరో మాటలో చెప్పాలంటే, ఫాస్ట్ బౌలర్లపై అత్యధిక శారీరక శ్రమను పెట్టే ఫార్మాట్‌లోనే సిరాజ్ మొత్తం పనిభారంలో 60 శాతం ఉంది. అందుకే వైట్ బాల్ క్రికెట్‌లో సిరాజ్ అవసరం లేదనిపిస్తున్నా.. రెడ్ బాల్



క్రికెట్‌లో మాత్రం తప్పనిసరిగా ఎంపిక చేయాల్సిన పరిస్థితి కల్పించాడు. 2023 నుంచి భారత్ 33 టెస్టులు ఆడగా, సిరాజ్ వాటిలో 30 టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇదే సమయంలో బుమ్రా.. కేవలం మూడింట రెండు వంతుల టెస్టులు ఆడాడు. 2025లో భారత్ ఇంగ్లాండ్‌లో పర్యటించినప్పుడు, సిరాజ్ ఐదు టెస్టుల్లోనూ ఆడిన ఏకైక భారత సీమర్‌గా నిలిచాడు. 185 ఓవర్లు బౌలింగ్ చేసి జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ముందున్న కఠిన సీజన్, వన్డే ప్రపంచకప్, టెస్టుల్లో సిరాజ్ అవసరాన్ని గుర్తించే సెలక్టర్లు ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20ల నుంచి సిరాజ్‌కు విశ్రాంతి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌లో భారత్ 17 వన్డేలు, 10 టెస్టులు ఆడాల్సి ఉంది. వన్డే ప్రపంచకప్ 2027 దృష్ట్యా.. బీసీసీఐ బుమ్రాతో పాటు.. సిరాజ్ పనిభారాన్ని కూడా ఇకపై పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం సిరాజ్ ఫిట్‌గా ఉన్నాడు, పనిభారం అనే పదం అతడికి అవసరం లేదు. కానీ సిరాజ్ మ్యాచ్ ఆడని పరిస్థితి తలెత్తకూడదనే ఉద్దేశంలో సెలక్టర్లు ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు!

## ఆసుపత్రిపాలైన బంగ్లాదేశ్ కెప్టెన్!

వన్డే క్రికెట్‌లో బంగ్లాదేశ్ సరికొత్త చరిత్రను సృష్టించింది. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2 1తో కైవసం చేసుకుంది. వన్డేల్లో ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి సిరీస్ విజయం. అయితే ఈ మ్యాచ్ అనంతరం బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ ఆసుపత్రిపాలయ్యాడు. బంగ్లాదేశ్ బ్యాటింగ్ సందర్భంగా ఆస్ట్రేలియా పేసర్ రైలీ మెరెడిత్ వేసిన 34వ ఓవర్‌లో మెహిదీ హసన్ తీవ్రంగా గాయపడ్డాడు. రైలీ మెరెడిత్ వేసిన బౌన్సర్.. మెహిదీ హసన్ హెల్మెట్ పక్క భాగాన్ని బలంగా తాకింది. దాంతో అతను క్రీజులో కుప్పకూలాడు. బంగ్లాదేశ్ ఫిజియో పెజ్జెతుల్ ఇస్లాం ఖాన్, ఆస్ట్రేలియా వైద్య బృందం హుటాహుటిన పరుగెత్తుకొచ్చారు. అతనికి ప్రథమ చికిత్స అందిస్తుండగా.. మెహిదీ హసన్ మైదానంలోనే వాంతులు చేసుకోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ సన్నివేశాలు భయానక పరిస్థితులను కల్పించాయి. అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లడానికి స్ట్రెచర్‌ను మైదానంలోకి తీసుకురాగా.. మెహిదీ హసన్ నిరాకరించాడు. బ్యాటింగ్ చేయగలనని చెప్పి ఫిజియోలను బయటకు పంపించాడు. తీవ్రమైన నొప్పితోనే బ్యాటింగ్ కొనసాగించిన మెహిదీహసన్.. సిక్సర్ కొట్టి బంగ్లాదేశ్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. మ్యాచ్ ముగిసిన వెంటనే మెహిదీ హసన్‌ను ఢాకాలోని ఆసుపత్రికి తరలించారు. టీమ్ ఫిజియో మాట్లాడుతూ.. మెహిదీ హసన్‌కు స్వల్ప గాయమే అయ్యిందని, ముందస్తు చర్యల్లో భాగంగానే ఆసుపత్రికి తరలించామని తెలిపాడు. ప్రస్తుతం అతను బాగానే ఉన్నాడని చెప్పాడు. మరో 24 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంటాడని తెలిపాడు. మెహిదీ హసన్ ఆసుపత్రికి వెళ్లడంతో నజ్ముల్ హుస్సేన్ షాంటో పోస్ట్ మ్యాచ్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. మెహిదీ హసన్ క్షేమంగా ఉన్నాడని చెప్పిన నజ్ముల్.. ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్ గెలవడం వర్ణించలేనిఅనుభూతి అని చెప్పాడు.వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 42 ఓవర్లలో 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. అనంతరం బంగ్లాదేశ్ 35 ఓవర్లలో 5 వికెట్లకు 195 పరుగులు చేసి డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 5 వికెట్ల తేడాతో గెలుపొందింది.

## భారత అండర్-19 టీంలోకి జూనియర్ ద్రావిడ్

ఇండియన్ క్రికెట్‌లో లెజెండ్ క్రికెటర్ల లిస్టులో ఉన్న టీమ్ ఇండియా స్టార్ బ్యాట్స్‌మెన్, 'ది వాల్' రాహుల్ ద్రవిడ్ తన క్రికెట్ ఆటను తిరిగి ప్రారంభిస్తుండగానే అతని ఇద్దరు కుమారులు అన్వయ్, సమిత్ కూడా క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నారు. ఇది ఒక విధంగా ద్రవిడ్ కుటుంబానికి శుభవార్తనే చెప్పాలి. రాహుల్ ద్రావిడ్ పెద్ద కుమారుడు సమిత్ తర్వాత ఇప్పుడు అతని చిన్న కుమారుడు అన్వయ్ కూడా తండ్రి అడుగుజాడల్లో నడిచాడు. తండ్రిలాగే ఈ లిటిల్ స్టార్ క్రికెటర్ కూడా వికెట్ కీపర్-బ్యాటర్ బాధ్యతను స్వీకరించాడు. మైదానంలో తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాడు.రాబోయే శ్రీలంక పర్యటన కోసం బీసీసీఐ జూనియర్ క్రికెట్ కమిటీ అండర్-19 జట్టును ప్రకటించింది.

జూలై 4 నుంచి ప్రారంభమయ్యే శ్రీలంక పర్యటనకు భారత అండర్-19 జట్టులో అన్వయ్ ద్రవిడ్ ఎంపికయ్యాడు. ఇది ఒకరకంగా ద్రావిడ్‌కి చాలా గర్వకారణమైన విషయమనే చెప్పాలి. రాహుల్ ద్రవిడ్ పెద్ద కుమారుడు సమిత్ ద్రవిడ్ ఫాస్ట్ బౌలింగ్ ఆల్-రౌండర్ కాగా అతని చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ వికెట్ కీపర్-బ్యాటర్. అన్వయ్ భారత అండర్-19 జట్టుకు ఎంపికైన తర్వాత వీరిద్దరూ భారత అండర్-19 జట్లకు ఎంపికయ్యారు. ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో గాయం కారణంగా 2024లో అవకాశం కోల్పోయిన సమిత్ స్థానంలో ఇప్పుడు శ్రీలంకతో వన్డే సిరీస్ కోసం భారత అండర్-19 జట్టుకు అన్వే ద్రవిడ్ ఎంపికయ్యాడు. తన తండ్రిలాగే ఇతను కూడా వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్‌గా ఆడతాడు. 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్ గత వినూ మంకడ్ ట్రోఫీలో కర్ణాటక అండర్-19 జట్టును క్వార్టర్ ఫైనల్స్‌కు నడిపించాడు. ఈ టోర్నమెంట్‌లో అతను ఆరు మ్యాచ్‌లలో మొత్తం 220 పరుగులు చేయగా, అతని అత్యధిక స్కోరు 82 నాటౌట్. శ్రీలంక పర్యటనకు అండర్-19 జట్టు - యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ (కెప్టెన్), సాగర్ విర్క్, లక్ష్య రాయచందానీ (వైస్ కెప్టెన్), వినీత్ వికె, అర్జున్ రాజ్‌పుత్, కుషాగ్రా ఓజా, రజత్ బఘెల్ (వికెట్ కీపర్), అన్వయ్ ద్రవిడ్ (వికెట్ కీపర్), అన్‌మోల్‌జీత్, విప్రతేషుద్‌కుడ్, యాష్‌ల్‌జీత్ సింగ్, వి. గౌడ్, వి. మోహిత్




ఉల్వా, ఇషాన్ సూద్.అయితే రాహుల్ ద్రావిడ్ క్రికెట్ ప్రపంచంలో ఉండగానే తన ఇద్దరు కొడుకులు భారత జూనియర్ జట్టులో చోటు సంపాదించడం పట్ల వాల్ ఫ్యాన్స్ కూడా గర్వంగా ఫీలవుతున్నారు. క్రికెట్ రంగంలో ద్రావిడ్ లెగసీని కంటిన్యూ చేస్తున్నారు అని సంబరపడిపోతున్నారు.

కొమురం భీమ్
Komurambheem Telugu Daily



# మాటే పాటయితే..
# సింగీతం తరహా మూవీ

■ సింగ్ గీతంతో కొత్తగా ఆలోచించిన దర్శకుడు

94ఏండ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఫాంటసీ కామెడీ మ్యూజికల్ ఫిల్మ్ 'సింగ్ గీతం'. మాటల్లేకుండా 'పుష్పక విమానం' వంటి గొప్ప క్లాసిక్‌ని తెరకెక్కించిన సింగీతం.. 'మాటలే పాటలైతే' అని కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందించారని తెలియగానే, ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి మొదలైంది. పైగా ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మించడం, సింగీతం విజన్‌కి నాగ్ అశ్విన్ మేకింగ్ తోడవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. కథలోకి వెళితే..ప్పుడే జైలు నుంచి విడుదలైన ప్రతాప్(ఆయాన్) తన తండ్రి తన పేరు రాసిన ఆస్తిని దక్కించుకునేందుకు అగ్రిమెంట్ పేపర్లను తీసుకొని కుబేరపురం గ్రామానికి వెళ్తాడు. అదో మిస్టీరియస్ విలేజ్. అక్కడ ఓ కొండ ఉంటుంది. ఆ కొండలో కుబేరుడి గుహ కూడా ఉంటుంది. ఆ ప్రాంత జనం కుబేరుడ్ని పూజిస్తుంటారు. ఎడారిని తలపించేలా ఉన్న ఆ ఊరిలో ఒకేఒక భారీ వృక్షం ఉంటుంది. ఆ చెట్టంటే ప్రాణం ఇచ్చే గౌరీ(అహల్య)ని కలుసుకుంటాడు ప్రతాప్. ఆమె ద్వారా సెల్ఫిష్ మైనింగ్ బిజినెస్ విమెన్ రేణు(షాలిని)ని కలుస్తాడు. ఆ ప్రాంతమంతా బంగారు గని అని రేణు మాటల ద్వారా తనకు అర్థమవుతుంది. రేణు, ఆమె తండ్రి(బెనర్జీ) ఇద్దరూ కలిసి తన పేరున్న స్థలంలో కూడా మైనింగ్ జరిపి, అక్కడున్న బంగారాన్ని కూడా దోచుకోవాలని చూస్తున్నారనే విషయం ప్రతాప్‌కి తెలుస్తుంది. ఉన్నట్టుండి భాగస్తుడైన ప్రతాప్ రావడంతో, చేసేది లేక రేణు, రేణు తండ్రి తమ వ్యాపారంలో ప్రతాప్‌ని కూడా భాగస్తుడిగా చేర్చుకుంటారు. అప్పటికే ఆ ప్రాంతం అంతా మైనింగ్ జరిపేసి ఉంటుంది. ఒక్క వృక్షం ఉన్న ప్లేస్‌లో మాత్రం మైనింగ్ జరిగి ఉండదు. దాంతో అక్కడ మైనింగ్ చేద్దామని ప్రతాప్ సూచించడంతో, అహల్య వద్దని వారిస్తున్నా, ఆ భారీ వృక్షాన్ని కూలగొడతారు. దీంతో గౌరీ తీవ్ర మనస్తానికి గురవుతుంది. ఆ బాధలోనే అనుకోకుండా కుబేర గుహలోకి వెళ్తుంది. ఊహించని విధంగా ఆ ఊరి జనమందరికీ మాట కాస్తా పాటై కూర్చుంటుంది. అందరూ నిజాలు చెప్పేస్తుంటారు. మాటను పాటలా పాడుతూ అంతా విచిత్రంగా, విడ్డూరంగా ఫీలవుతుంటారు? ఆ జనానికి మళ్లీ మాట ఎలా వచ్చింది? కుబేరుడి శాపం వల్ల ఆ ప్రాంతంలో ఎలాంటి పరిణామాలు తలెత్తాయి? అనేది మిగతా కథ. సింగీతం శ్రీనివాసరావు అంటేనే ఓ ప్రయోగశాల. మాటే పాటైతే అంటూ మరో కొత్త ప్రయోగానికి తెర లేపుతూ చేసిన ప్రయత్నమే ఈ సినిమా. ఇది అన్ని సినిమాల్లాంటి సినిమా కాదు. నాగ్ అశ్విన్ చెప్పినట్టు ఇలాంటి సినిమాను ప్రపంచం నిజంగానే చూడలేదు. అది నిజంగా వందశాతం నిజం. అసలు ఇలాంటి ఆలోచన రావడమే నిజంగా గొప్ప విషయం. ఈ విభిన్నమైన కథ ద్వారా చాలా గొప్ప విషయాలను స్పృశించారు సింగీతం. పచ్చని చెట్టు బంగారం కంటే మిన్న అనే సందేశం ఈ సినిమాతో ఆయనిచ్చారు. పర్యావరణం గొప్ప తనాన్ని తెలిపేలా ఈ సినిమా తీశారు. సింగీతం విజన్‌ని, తెరపైకి తెచ్చేందుకు నాగ్ అశ్విన్ పడిన కష్టం అణువణువునా కనిపించింది. ఈ ప్రయోగం జనానికి ఎక్కితే, ఇది కచ్చితంగా మరో గొప్ప ప్రయత్నం అవుతుందని చెప్పక తప్పదు. . ప్రయోగాత్మక చిత్రాలు ఇష్టపడే వాళ్లకు 'సింగ్ గీతం' కచ్చితంగా కొత్త అనుభూతిని ఇస్తుంది.










## మా ఇంటి బంగారం సమంత కోసం వెయిటింగ్

మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించారు. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇది సెన్సార్ పనులు పూర్తి చేసుకుని యూఏ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించింది. 'కుటుంబ భావోద్వేగాలతో నిండిన యాక్షన్ చిత్రమిది. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు.. వెచ్చించే సమయానికి.. అన్నింటికీ న్యాయం చేసేలా ఉంటుంది' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సంతోష్ నారాయణన్, ఛాయాగ్రహణం: ఓం ప్రకాశ్.

## జైలర్-2లో గెస్ట్ పాత్రలో హృత్రిక్ ?

సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో మొదట బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ అండ్ ఇంటెన్స్ కామియో రోల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో రజినీకాంత్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'భగవాన్ దాదా' (1986) చిత్రం తర్వాత, దాదాపు 40 సంవత్సరాల అనంతరం వీరిద్దరూ కలిసి మళ్లీ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌కి సంబంధించిన కొన్ని కీలకమైన సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో భారీ ఎత్తున చిత్రీకరించనున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ మైండ్ బ్లోయింగ్ క్రేజీ అప్‌డేట్ ఇటు సౌత్ ఇండస్ట్రీతో పాటు అటు నార్త్ ప్రేక్షకుల్లోనూ సినిమాపై ఉన్న అంచనాలను ఒక్కసారిగా స్కై హైకి తీసుకెళ్లింది.




సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, ఎస్.జె.సూర్య, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సీనియర్ నటి రమ్యకృష్ణ, మిర్నా మీనన్, హాస్య నటుడు యోగి బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తుండగా, ఈ ఏడాది చివర్లోనే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




## పూరీ మార్క్... స్లమ్ డాగ్ టీజర్

డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్‌డాగ్ -33 టెంపుల్ రోడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా చిత్రయూనిట్ ఈ టీజర్ వెనుక ఉన్న కష్టాన్ని, షూటింగ్ ఆసక్తికర విశేషాలను చూపిస్తూ ఒక పవర్‌ఫుల్ 'టీజర్ మేకింగ్ వీడియో'ను విడుదల చేసింది. ఈ మేకింగ్ వీడియోలో దర్శకుడు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ స్టైల్‌లో సీన్లను ఎంత అద్భుతంగా డిజైన్ చేశారో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయ్ సేతుపతి ఒక యాచకుడి పాత్రలో విలక్షణమైన గెటప్, విభిన్నమైన డైలాగ్ డెలివరీ, మరియు యాక్షన్ సీక్వెన్స్ కోసం పడిన శ్రమ ఈ వీడియోలో ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం సమాజంలో మనం చూసే యాచకుల వెనుక ఉండే కొన్ని నిజమైన సంఘటనలు మరియు బలమైన ఎమోషన్స్ ఆధారంగా తెరకెక్కుతోందని పూరి జగన్నాథ్ వివరించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి టబు ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా, హీరోయిన్‌గా సంయుక్త.. కన్నడ నటుడు దునియా విజయ్ విలన్ రోల్‌లో కనిపించ బోతున్నారు.




## కిరణ్ అబ్బవరం కెఎ 13

### సొంత బ్యానర్‌పై దర్శకత్వ బాధ్యతలు

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో సరికొత్త అడుగు వేస్తూ, సరికొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 13వ చిత్రానికి 'కెఎ13' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కాబోతున్నట్లు చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా ప్రకటించింది. అయితే ఈ చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా స్వయంగా ఆయనే చేపట్టడం విశేషం. దర్శకుడిగా ఆయనకు ఇది సరికొత్త ప్రయాణం కానుంది. జాయ్ ఫిల్మ్ప్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక లాడ్జ్ లేదా హోటల్ రిసెప్షన్ డెస్క్‌పై ఉండే బెల్‌ను నొక్కుతున్నట్లుగా ఉన్న ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సస్పెన్స్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

Printer, Published and Owned by YASHASHWIN PUBLICATIONS, H.No. 21-1-29/A/J/1, GODAVARIKAHNI, Dist. Peddapalli, TELANGANA STATE - 505 209.
Printers : Yashashwin Printers, Godavarikhani. Editor : MULKALA PRASAD, RNI No. : TELTEL/2019/79009, e-mail : komurambheemnews@gmail.com, Mobile : 8522024855